www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 10 నవంబర్ 2025
5
అన్నమయ్య

నేడు యథావిధిగా
'ప్రజాసమస్యల పరిష్కార వేదిక'

ప్రజాశక్తి-రాయచోటి

ప్రజల నుంచి వారి సమస్యలను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు సోమవారం ఉదయం 10 గంటల నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా కేంద్రం రాయచోటితో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో యథావిధిగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ విజ్ఞప్తులను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు. మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో జరిగే ప్రజా సమ స్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి రాగలరని తెలిపారు.

భవిష్యత్తు సమాజ నిర్మాతలు గైడ్ కెప్టెన్లు

ప్రజాశక్తి-రాయచోటి

బాలికల ఎదుగుదలకు ప్రేరణగా నిలుస్తున్న గైడ్ కెప్టెన్లు ధైర్య సాహసాలకు ప్రతీకలని, భవిష్యత్ సమాజ నిర్మాతలని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల రాష్ట్ర సంచాలకులు డి. దేవానంద రెడ్డి అన్నారు. పట్టణం డైట్‌లో ఈనెల 3వ తేదీ నుంచి 9వ తేదీ వరకు ఏడు రోజులపాటు నిర్వహించిన గైడ్ కెప్టెన్ల బేసిక్ శిక్షణ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులలో చిన్ననాటి నుంచే క్రమశిక్షణతో పాటు దేశభక్తి, సామాజిక సేవా భావాలను పెంపొందించడానికి బాలభటుల ఉద్యమం (స్కౌట్స్ అండ్ గైడ్స్) తోడ్పడుతుందన్నారు. బాలికల్లో సేవాభావం, క్రమశిక్షణ, ధైర్యం, సాహసం వంటి మానవీయ విలువలను పెంపొందించడంలో గైడ్ కెప్టెన్ల పాత్ర ఎనలేనిదన్నారు. వారు కేవలం శిక్షకులు మాత్రమే కాకుండా, బాలికలకు ఆదర్శంగా నిలిచి జీవితంలో ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు కృషి చేయాలన్నారు. భవిష్యత్తు సమాజ నిర్మాణంలో గైడ్ కెప్టెన్ల పాత్ర ఎనలేనిదన్నారు. అనంతరం పిటిఎం మండలం కమ్మచెరువు హైస్కూల్ ప్రధానోపాధ్యాయిని లలిత రూ.10 వేలు చెల్లించి స్కౌట్ జీవిత సభ్యురాలుగా చేరడం గొప్ప విషయమన్నారు. ఆంధ్రప్రదేశ్ తరపున జాతీయస్థాయిలో ప్రకృతి వైపరీత్యాలపై భువనేశ్వర్‌లో 21 రోజులపాటు నిర్వహించిన శిక్షణలో పాల్గొన్న వెంకటరమణను ప్రత్యేకంగా అభినందించారు.

మాట్లాడుతున్న కెజిబివి రాష్ట్ర సంచాలకులు దేవానంద రెడ్డి

అనంతరం గైడ్ కెప్టెన్లు దేవానందరెడ్డిని పూల మాలలు, దృశ్శాలువాతో సత్కారం చేశారు. కార్యక్రమంలో లీడర్ ఆఫ్ ది కోర్స్ కస్తూరి సుధా కర్, జిల్లా సెక్రటరీ మడితాటి నరసింహారెడ్డి, అసిస్టెంట్ స్టేట్ ఆర్గనైజింగ్ కమిషనర్ లక్ష్మీకం, ఆపదమిత్ర నోడల్ ఆఫీసర్ గురునాథరెడ్డి, అడ్వాన్స్ గైడ్ కెప్టెన్లు సుజాత, వివిధ మండలాల నుంచి వచ్చిన 57 మంది గైడ్ కెప్టెన్లు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ ఉర్దూ దినోత్సవం

ఉర్దూ కవిత్వ పోటీలలో విజేతలైనవిద్యార్థుల తో అంజుమన్ ఉర్దూ నేతలు

ప్రజాశక్తి - రాయచోటి అర్బన్

పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అంజుమన్ తరఖీ ఉర్దూ సహారా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఉర్దూ దినోత్సవం, సారే జహాసే అచ్ఛా హిందుస్థాన్ హమారా గేయ రచయిత అల్లామా మహమ్మద్ ఇక్బాల్ జయంతి వేడుకలు ఘనంగాయ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులుచే ఉర్దూ కవితలు, గేయాల పోటీ నిర్వహించి పోటీలో గెలుపొందిన విద్యార్థులకు బహు మతులు ప్రదానం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఇడిపి పట్టణ అధ్యక్షులు బోనమల్ల ఖాదర్‌వలి, రాజంపేట పార్లమెంటు అధికార ప్రతినిధి వతన్ నిస్సార్ మాట్లాడుతూ స్వాతంత్ర సమరంలో ఉర్దూబాష కీలక భూమిక పోషించిందన్నారు. కవిత్వం, సాహిత్యం ప్రసంగాలతో ఇంఖిలాబ్ జిందాబాద్ అనే నినాదంతో ఎంతో మందిని దేశ స్వాతంత్ర్య సమరంలోకి చేరి ప్రాణాలు సైతం అర్పించేలా ప్రేరేపించిందన్నారు. ఉర్దూ కేవలం ముస్లింల భాషా కాదని ఇది భారతదేశంలో పుట్టి ఇక్కడే పెరిగి ఇక్కడే ప్రాచుర్యం పొందిందని తెలిపారు. పాత ఈద్గా కమిటీ అధ్యక్షులు సయ్యద్ రియాజుద్దీన్ మాట్లాడుతూ స్వచ్ఛంద సేవా సంస్థలు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం చాలా సంతోషించదగ్గ విషయమని, ఇలాంటి కార్యక్రమాలకు తమ సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటా యని తెలిపారు. సహారా వెల్ఫేర్ సొసైటీ ప్రధాన కార్యదర్శి షేక్ ఆఫ్తాబ్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో రెండో అధికారిక భాషగా ఉన్న ఉర్దూను రాష్ట్ర రాజముద్ర లో చోటు కల్పించాలని ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. అనంతరం ఉర్దూ భాష అభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్న ఉర్దూ ఉపాధ్యాయులకు ముఖ్య అతిధులకు సన్మానించారు. అనంతరం ఉర్దూ కవిత్వ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో అంజుమన్ తరఖీ ఉర్దూ అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి హాషిమ్, మహమ్మద్ అలీసదా, ఆరిఫ్, నాసర్ నియాజ్ మన్సూర్ షఫీ సహారా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు సయ్యద్ అమీర్‌అలీ, కోశాధికారి జిలానిబాషా, కార్యదర్శి మొగల్ ఇలియాస్ బేగ్, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

న్యాయ సేవలు అందించడమే లక్ష్యం
- జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి.యామిని

ప్రజాశక్తి - కడప

మహిళలు, వికలాంగులు , షెడ్యూల్ తెగలు, పిల్లలు, షెడ్యూల్ కులాలు, మానవ అక్రమ రవాణా బాధితులు అలాగే ప్రకృతి వైపరీత్యాల బాధితులైన బలహీన వర్గాలకు దేశవ్యాప్తంగా ఎటువంటి రుసుం లేకుండా న్యాయ సేవలను అందించడం న్యాయ సేవల దినోత్సవం ముఖ్య లక్ష్యమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి. యామిని అన్నారు. ఆదివారం జిల్లా కోర్టులోని న్యాయ సేవా సదన్‌లో న్యాయ సేవల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. 2025 ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉత్తమ పారా లీగల్ వాలంటరీ అవార్డును కడప జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ పొందింది అని ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గౌరవ సుప్రీంకోర్టు 1995లో న్యాయ సేవలు దినోత్సవాన్ని ఏర్పాటు చేసిందన్నారు. జాతీయ న్యాయ సేవ అధికార సంస్థ ప్రవేశపెట్టిన నల్సా పథకాలను, లీగల్ సర్వీసెస్ అథారిటీ యాక్ట్ 1987, న్యాయ విజ్ఞాన సదస్సులు, ఉచిత న్యాయ సహాయాలు, ఫ్రంట్ ఆఫీస్, లీగల్ ఎయిడ్ క్లినిక్, ఇంటింటి న్యాయ ప్రచారాలను వివరించారు. జిల్లావ్యాప్తంగా న్యాయవిజ్ఞాన సదస్సులు 838, ఇంటింటి న్యాయ ప్రచారాల ద్వారా 90305 ప్రత్యక్షంగా అవగాహన, 573 మంది నిరుపేద పిల్లలకు ఆధార్ రిజిస్ట్రేషన్ కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. ఒంటరి మహిళ పెన్షన్లు, గిరిజన ప్రాంతాలలో ఎలక్ట్రిక్ స్తంభాలు, లైట్లను ఏర్పాటు చేయడం చెప్పారు. 214 మందికి ఉచిత న్యాయ సహాయం, 43 కేసులు మీడియేషన్‌లో పరిష్కరించామని చెప్పారు. మూడు జాతీయ లోక్ అదాలత్‌ల ద్వారా 53001 కేసులు పరిష్కరించి రూ. 76 .92 కోట్లు చెల్లించామని పేర్కొ న్నారు. ప్రజలు ఎవరైనా వారి సమ స్యలను అర్జీ రూపంలో సమర్పిస్తే వెనువెంటనే సంబంధిత అధికా రులకు పంపించి తక్షణ చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఫ్రీ లిటిగేషన్ కేసులు, జాతీయ లోక్ అదాలత్‌లు, మధ్యవర్తిత్వం, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం పట్ల అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. న్యాయ సేవల దినోత్సవం సందర్భ ంగా 'లీగల్ సర్వీసెస్ స్కీమ్స్, ప్రోగ్రా మ్స్' అనే అంశంపై విద్యాసంస్థలలో వ్యాసరచన, వక్తృత్వపు, క్విజ్ పోటీలను నిర్వహించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచిన విద్యార్థులకు న్యాయమూర్తులచే సర్టిఫికెట్లు ఈ సందర్భంగా అందజేశారు. అంతకుముందు జిల్లా కోర్టు ప్రాంగణం నుంచి ఆర్‌టిసి బస్టాండ్ వద్ద ఉన్న అంబేద్కర్ సర్కిల్ వరకు, అంబేద్కర్ సర్కిల్ నుంచి కోర్టు ప్రాంగణం వరకు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి. యామిని ప్రారంభించారు. కార్యక్రమంలో 7వ అదనపు జిల్లా న్యాయమూర్తి జి.రమేష్ కుమార్, కడప అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జ్ మరియు కడప ఇంచార్జ్ సెక్రెటరీ జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ జి.సి. ఆసిఫా సుల్తానా, కడప ఫస్ట్ అడిషనల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ జడ్జ్ ఎం.రేష్మ, కడప సెకండ్ అడిషనల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ జడ్జ్ ఎం, ఈశ్వర్ వెంకటప్రసాద్, ప్రభుత్వ అధికారులు, బార్ ప్రెసిడెంట్ రాఘవరెడ్డి, న్యాయవాదులు, ప్యానల్ న్యాయవాదులు, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులు, పార లీగల్ వాలంటరీలు, ఎన్జీవోలు, వివిధ స్కూళ్ళ, విద్యార్థులు, టీచర్లు, ప్రొఫెసర్లు, లెక్చరర్లు పాల్గొన్నారు.

న్యాయసేవల దినోత్సవం కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ సి. యామిని

కర్షక కవి దువ్వూరి రామిరెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్

కవిగా, రచయితగా, విమర్శకులుగా, నాటక కర్తగా ప్రసిద్ధులైన కవి కోకిల దువ్వూరి రామిరెడ్డి సంప్రదాయ రీతులను మిళితం చేసి కొత్త తరానికి సాహితీ బాటలు వేశారని కడప రెడ్డి సేవా సమితి ప్రధాన కార్యదర్శి లెక్కల కొండారెడ్డి అన్నారు. ఆదివారం కడప రెడ్డి సేవా సమితి సమావేశ మందిరంలో ఆదివారం 'కర్షక కవి' దువ్వూరి రామిరెడ్డి 131వ జయంతిని ఘనంగా నిర్వహించారు. మొదట ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా లెక్కల కొండారెడ్డి మాట్లాడుతూ దువ్వూరి వారి శైలి ప్రత్యేకమైందని,ఆయన కలకండ వంటి కమ్మని కావ్యాలు రాయడమే కాకుండా,అరబిక్ భాషల నుంచి ఎన్నో గ్రంథాలను నవ్య రీతిలో ఆంధ్రీకరించిన ఘనుడని చెప్పారు. ఆయనకు 1929లో విజయవాడ ఆంధ్ర మహాసభ ద్వారా' కవి కోకిల 'బిరుదు ప్రదానం చేశారని తెలిపారు. వైఎస్ఆర్ కడప జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి ప్రధాన వక్తగా మాట్లాడుతూ 'సింహపురి సిరి' గా పేరు తెచ్చుకున్న దువ్వూరి రామిరెడ్డి ఆధునిక సాహిత్య చరిత్రలో పరిచయం అక్కరలేని ప్రసిద్ధ కవియని, ఆయన రాసిన కృషీవలుడు అద్భుతమైన కావ్యమని పేర్కొన్నారు. దువ్వూరి వన కుమారి కావ్యం విజయనగరం మహారాజ ఆస్థానంలో కావ్య స్పర్ధలో ప్రథమ స్థానం పొందిందని చెప్పారు. నాగూరు రవీంద్రనాథరెడ్డి మాట్లాడుతూ చిత్రనళీయం సినిమాకు కథ రాసి, దర్శకత్వం వహించిన మొట్టమొదటి తెలుగు కవి దువ్వూరి వారే అన్నారు. రెడ్డి సేవా సమితి కోశాధికారి గడ్డ ఆదినారాయణ రెడ్డి మాట్లాడుతూ ఒక సామాన్య రైతు కుటుంబంలో పుట్టిన దువ్వూరి రామిరెడ్డి సాహిత్య రంగానికి చేసిన సేవలు చిరస్మరణీయమైనవి అన్నారు. కార్యక్రమంలో రెడ్డి సేవా సమితి వసతి గృహ విద్యార్థినులు పాల్గొన్నారు.

ఎఎంసి ప్రమాణ స్వీకారానికి పవన్‌కల్యాణ్‌కు ఆహ్వానం

ప్రజాశక్తి-మదనపల్లె : పట్టణంలోని నీరుగట్టివారిపల్లిలో గల అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ(ఎఎంసి) పాలకమండలి ప్రమాణ స్వీకారోత్సవానికి డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్‌ను ఆహ్వానించినట్లు ఎఎంసి చైర్మన్ జంగాల శివరామ్‌రాయల్ తెలిపారు. పలమనేరు సమీపంలోని ముసలిమడుగు అటవీ ప్రాంతంలో కుంకి ఏనుగుల శిక్షణ కార్యక్రమానికి విచ్చేసిన డిప్యూటీ సిఎంను శివరామ్‌రాయల్ మర్యాద పూర్వకంగా కలుసుకుని ఆహ్వానించారు. ఈ సందర్భంగా పవన్‌కు పర్యావరణానికి హానిక లిగించని ఎనుగు దాంగ్‌తో తయారు చేసిన అరుదైన పుస్తకాన్ని బహుకరించారు. కలపను ఉపయోగించకుండా పూర్తిగా ప్రకృతికి అనుకూలంగా తయారు చేసిన ఈ పుస్తకం ప్రపంచంలోనే అత్యంత అరుదైనదన్నారు. పుస్తకాన్ని అందుకున్న పవన్ కల్యాణ్ దాని ప్రత్యేకతను ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం మదనపల్లె ఎఎంసి పాలకమండలి ప్రమాణ స్వీకార కార్యక్రమంపై వివరాలు తెలుసుకుని శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జనసేన కన్వీనర్ గంగారపు రామదాసు చౌదరి, జనసేన నాయకులు పాల్గొన్నారు.

పవన్ కల్యాణ్‌కు ప్రమాణ స్వీకార ఆహ్వానం ఇస్తున్న జంగాల శివరాం

ప్రతి గ్రామాన్నీ శుభ్రంగా ఉంచుకోవాలి
జిల్లా పంచాయతీ అధికారి రాధ



ముఖా ముఖి..

ప్రజాశక్తి- రాయచోటి

జిల్లాలో ప్రతి గ్రామాన్నీ శుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి రాధ పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా గ్రామాల వివరాలు, ఏడాదిలో విడుదలైన నిధుల వివరాలు, గ్రామాల అభివృద్ధి, ప్లాస్టిక్ నివారణ, గ్రామాలను ఎలా అభివృద్ధి చేసుకోవాలో ప్రజాశక్తికి ఇచ్చిన ముఖా ముఖిలో ఆమె వివరించారు.

అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా ఎన్ని పంచాయితీలు, జనాభా వివరాలు తెలపండి?

అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా 501 గ్రామ పంచాయితీలున్నాయి. గ్రామీణ ప్రాంతంలో 3, 5,980, (2011 ప్రకారం), పట్టణ ప్రాంతంలో 13,06,000 మంది జనాభా ఉన్నారు.

ఈ సంవత్సరానికి ఎంత బడ్జెట్ విడుదల చేశారు? వాటి ద్వారా ఏయే పనులు నిర్వహిస్తున్నారు?

2025-26 సంవత్సరానికి 15వ ఆర్థిక సంఘం నిధుల కింద (కేంద్ర ప్రభుత్వం నుండి) యూఎన్- టిఐడి ఈ మొత్తం (వడ్డీ తో సహ) రూ .12,24,65,418,టిఐడి ఈ మొత్తం (వడ్డీతో సహ) రూ.18,36,20,368, సర్పంచుల గౌరవవేతనం రూ.97,02,000, వృత్తి పన్ను రూ.55,10, 324, తలసరి నిధులు రూ.22, 83,765, సీనరేజ్ నిధులు రూ.1,47,97,202 గ్రాంటు కింద విడుదలైనాయి.

విడుదలైన నిధులతో పంచాయతీలలో మౌలిక వసతులు కల్పిస్తున్నారా?

అన్నమయ్య జిల్లాలోని పంచాయతీలలో మౌలిక వసతుల కల్పన ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం, జిల్లాలో మౌలిక వసతుల పరిస్థితి మెరుగు పరచడానికి ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంటోంది. పౌర సదుపాయాలు ప్రతి ఇంటికి కుళాయి ద్వారా నీటి సరఫరా అందించేందుకు జల్ జీవన్ మిషన్ అమలు అవుతుంది. గ్రామాల్లో పారిశుధ్య మెరుగుదలకు చర్యలు తీసుకుంటున్నాం. వీధి దీపాలు ఏర్పాటు చేయడం, వాటి నిర్వహణకు ప్రాధాన్యత ఇస్తున్నాం. గ్రామాలలో సిమెంటు రోడ్ల నిర్మాణం, పాత రోడ్లను మరమ్మతులు చేపడుతున్నాం. పంచాయతీరాజ్ రోడ్ల మెరుగుదలకు నిధులు కేటాయిస్తున్నాం. జిల్లాలో 4,131.43 కి.మీ.ల పంచాయతీరాజ్ రోడ్లున్నాయి. జిల్లాలోని పంచాయతీలలో మౌలిక వసతులను మెరుగుపరచడానికి రోడ్లు, తాగునీరు, పారిశుధ్యం, వీధి దీపాల కల్పనవంటి వాటిపై దృష్టి సారిస్తూ, వివిధ పథకాలు, నిధులను వినియోగిస్తున్నాం.

పంచాయతీల అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

గ్రామాల్లో మౌలిక వసతులు, ప్రభుత్వ ఆస్తుల స్థితిగతులను పర్యవేక్షించడానికి జిపి మానిటరింగ్ సర్వేకూడా నిర్వహిస్తు న్నారు. దీని ద్వారా వాస్తవ సమస్యలను అంచనా వేసి అభివృద్ధికి చర్యలు తీసుకోడానికి ప్రభుత్వం యోచిస్తోంది. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద సిసి రోడ్ల నిర్మాణం, ఇతరగ్రామీణ మౌలిక సదుపాయాల బలోపేతానికి నిధులు కేటాయిస్తున్నాం.

పారిశుధ్యంపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జిల్లాలో పారిశుధ్య మెరుగుదలకోసం ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం పలు కార్య క్రమాలను, చర్యలను అమలు చేస్తున్నాయి. ప్రతి నెలా మూడో శనివారం రోజున 'స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. ఇందులో భాగంగా కలెక్టరేట్ పరిసరాలలో, ఇతర అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో అధికారులు, సిబ్బంది శ్రమదానం చేసి పరిసరాలను శుభ్రం చేస్తున్నారు. రాయచోటి వంటి ప్రాంతాల్లో కంపోస్టబుల్ క్యారీ బ్యాగులు తయారుచేసే సంస్థలకు కాలుష్య నియంత్రణ మండలి నుంచి అనుమతులు ఇస్తూ, పర్యావరణానికి హాని చేయని ప్రత్యామ్నాయాల ఉత్పత్తిని ప్రోత్సహిస్తున్నారు.

జిపిఆర్ఎస్ ఫిర్యాదులు ఎన్ని వచ్చాయి? ఎన్ని పరిష్కారం చేశారు?

ఈ ఏడాది మొత్తం కార్యాలయానికి 816 ఆర్జీల అందాయి. ఇప్పటి వరకు 775 పరిష్కరించాం.

ప్రజలకు సలహాలు, సూచనలు ఏమైనా ఇవ్వాలనుకుంటున్నారా?

జిల్లాలోని గ్రామీణ ప్రాంత ప్రజలకు పారిశుధ్యం పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి. ఆరోగ్యం, బహిరంగ మల విసర్జన పూర్తిగా మానేసి, ప్రతి ఒక్కరూ ఇంట్లో ఉన్న లేదా సామాజిక మరుగు దొడ్లను మాత్రమే ఉపయోగించాలి. ఇది ముఖ్యంగా పిల్లల ఆరోగ్యాన్ని, గ్రామం పరిశుభ్రతను మెరుగుపరుస్తుంది. భోజనానికి ముందు, తరువాత, మరుగు దొడ్లు ఉపయోగించిన తరువాత సబ్బుతో చేతులు శుభ్రంగా కడుక్కోవడం అలవాటు చేసుకోవాలి. తాగే నీటిని సురక్షితంగా, మూతలు ఉన్న పాత్రలలో నిల్వ చేయండి. మీ ప్రాంతంలో పారిశుధ్య సమస్యలపై సచివాలయాన్ని లేదా పంచాయతీ కార్యదర్శిని సంప్రదించి సమస్య పరిష్కారం కాకపోతే, 'స్పందన' వంటి ఫిర్యాదుల పరిష్కార వేదికలను ఉపయోగించుకోవాలి. పరిశుభ్రత సంపూర్ణ ఆరోగ్యానికి తొలిమెట్టు మీ గ్రామాన్ని, మీ ఇంటిని శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన, అందమైన అన్నమయ్య జిల్లా నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలి.

'ఆదిత్య'లో పరిశోధన జర్నల్స్‌పై అవగాహన

అతిథులకు బహుమతులు అందిస్తున్న హెచ్ఒడిలు

ప్రజాశక్తి-మదనపల్లె

మదనపల్లె సమీపంలోని ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో జెనరేటివ్ ఎఐ టూల్స్ సహకారంతో పరిశోధన జర్నల్స్, పుస్తకాల నైతిక ప్రచురణ అనే అంశంపై ఒకరోజు ఫ్యాకల్టీ వర్క్‌షాప్ ఘనంగా నిర్వహించినట్లు డైరెక్టర్ డాక్టర్ రామలింగారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆనంతలక్ష్మీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ (ఆనంతపురం) ఆర్‌డి డీన్ డాక్టర్ మురళీధర్ కూర్ధి పాల్గొన్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జెనరేటివ్ ఎఐ టూల్స్ అయిన చాట్ జిపిటి, జెమినీ, కోపైలట్ వంటి వాటి వాడకం పరిశోధనా ప్రచురణలో సులభతరం చేసినప్పటికీ, వాటి వల్ల నైతిక సవాళ్లు, మూలాధార ప్రామాణికత ప్రచురణలో నైతికతను పాటించడం అత్యంత అవసరమనిపేర్కొన్నారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎస్. రామలింగరెడ్డి మాట్లాడుతూ ఎఐ టూల్స్ వలన ప్రచురణ సులభతరం అయినా, పరిశోధకులు వాటిపై పూర్తిగా ఆధారపడకూడదన్నారు. నిజమైన పరిశోధన మన విశ్లేషణా సామర్థ్యం, స్వతంత్ర ఆలోచన, మరియు నైతిక దృక్పథంపై ఆధారపడాల న్నారు. భవిష్యత్తు తరాలు ఎఐని జాగ్రత్తగా, జ్ఞానపూర్వకంగా ఉపయోగించే దిశగా ప్రయాణిం చాలన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ రాయుడు మాట్లాడుతూ ఎఐ టూల్స్ సౌలభ్యం ఉన్నప్పటికీ, వాటి వెనుక ఉన్న బాధ్యతా భావం, నిజమైన సమాచార ప్రాముఖ్యత, అకడమిక్ ఇన్‌టెగ్రిటీ గురించిన అవగాహన కూడా సమానంగా అవసరమన్నాఉ. పరిశోధన అనేది కేవలం టూల్స్ వినియోగం కాదు, అది సృజనా త్మకత, నైతికత కలయిక అన్నారు. డాక్టర్ పి.గంగాధరరెడ్డి మాట్లాడుతూ అధ్యాపకులలో పరిశోధన నైపుణ్యాలను అభివృద్ధి చేయడంతో పాటు నైతిక అవగాహన పెంపొందించేందుకు ఇలాంటి వర్క్‌షాప్‌లు ఎంతో దోహదపడతాయని తెలిపారు కార్యక్రమంలో డీన్ (అకడెమిక్స్) వివిఎన్. భాస్కర్, విభాగాధిపతులు, అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు ఎంపికైన మిట్స్ విద్యార్థులు

'మిట్స్'విద్యార్థులకు
కాగ్నిజెంట్‌లో ఉద్యోగాలు

ప్రజాశక్తి-మదనపల్లె

మదనపల్లె సమీపంలోని మిట్స్-2026 గ్రాడ్యుయేటింగ్ బ్యాచ్‌కు చెందిన 182 మంది బి.టెక్ ఫైనల్ ఇయర్ విద్యార్థులు ప్రపంచ ప్రసిద్ధ ఐటి సేవల సంస్థ కాగ్నిజెంట్ టెక్నాలజీస్‌లో ఉద్యోగాలను సాధించారు. ఈ విషయాన్ని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి. రామనాథన్ ప్రకటించారు.ఈ విజయాన్ని విద్యార్థుల అంకితభావం, అధ్యాపకుల మార్గదర్శకత్వం, నాణ్యమైన సాంకేతిక విద్యా ప్రమాణాలు, పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాల అభివృద్ధి ఫలితమేనని పేర్కొన్నారు. కాగ్నిజెంట్‌లో ఎంపికైన విద్యార్థుల్లో సిఎస్ఇ విభాగం నుంచి 72 మంది, సిఎస్‌టి నుంచి 35 మంది, సిఎఐ నుంచి 38 మంది, సైబర్ సెక్యూరిటీ నుంచి9 మంది, డేటా సైన్స్ నుంచి 13 మంది, ఇపిఇ నుంచి నుండి 11 మంది, ఇఇఇ నుంచి ఇద్దరు, ఎం.టెక్ (సిఎస్ఇ) నుంచి ఇద్దరు ఎంపికయ్యారని తెలిపారు. వీరికి గరిష్ట వార్షిక వేతనం రూ.6.75 లక్షలు, కనిష్టంగా రూ.4 లక్షల నుంచి రూ.5.5 లక్షల వరకు ఉంటుందని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను మిట్స్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ ఫౌండర్ ఛాన్సలర్ డాక్టర్ ఎన్.విజయ భాస్కర్ చౌదరి, ప్రోఛాన్సెలర్ ఎన్.ద్వారకానాథ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల, వైస్ ఛాన్సెలర్ డాక్టర్ సి.యువరాజ్, డీన్లు, విభాగాధిపతుల, ప్లేస్‌మెంట్ ఆఫీసర్లు అభినందనలు తెలిపారు.

కడప, అనంతపురం మ్యాచ్ డ్రా

ప్రజాశక్తి - కడప : ఎసిఎ సౌత్ జోన్ అండర్-14 మల్టీ డే మెన్ టోర్నీలో భాగంగా వై.ఎస్. రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో కడప, అనంతపురం జట్ల మధ్య జరిగిన మ్యాచ్ డ్రాగా ముగిసింది. మొదటి ఇన్నింగ్స్‌లో కడప జట్టు 198 పరుగులు చేసింది. మూడు వికెట్ల నష్టానికి 54 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో చివరి రోజు బ్యాటింగ్ ప్రారంభించిన అనంతపురం జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 71.5 ఓవర్లలో 147 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. కడప జట్టులోని వర్షిత్ రెడ్డి 3, విక్రాంత్ 3 వికెట్లు తీసుకున్నారు. అనంతరం రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన కడప జట్టు ఆట ముగిసే సమయానికి 46.0 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 149 పరుగులు చేసింది. ఆ జట్టులోని తాహిర్ 61 పరుగులు చేశాడు. అనంతపురం జట్టులోని టేడ్రిక్ 2, క్రితిక్ సాయి రెండు వికెట్లు తీసుకున్నారు. మ్యాచ్ డ్రాగా ముగిసింది. మొదటి ఇన్నింగ్స్‌లో కడప జట్టు ఆధిక్యత సాధించింది.

ఇంద్రజాల ప్రదర్శన చేస్తున్న విద్యార్థి

ఆకట్టుకున్న ఇంద్రజాల ప్రదర్శన

ప్రజాశక్తి-రాజంపేట

జెవిఆర్, యుపిరాయుడు ఆధ్వర్యంలో ఆదివారం ఆంధ్రప్రదేశ్ మ్యాజిక్ అసోసియేషన్ పర్యవేక్షణలో వజ్రం ఫంక్షన్ హాల్లో 41వ మ్యాజిక్ ఫెస్టివల్ ఘనంగా నిర్వహించారు. మహారాష్ట్ర ఒరిస్సా కర్ణాటక రాష్ట్రాల నుంచి సుమారు 148 మంది ఇంద్ర జాలికులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నట్లు తెలిపారు. జూనియర్ విభాగంలో సుభాని మొదటి స్థానం, మహమ్మద్ ఇబ్రహీం, లతీశ్వర్ రెండు , మూడవ స్థానాలు దక్కించుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సీనియర్ విభాగంలో సురేష్ మొదటి స్థానం శంకర్, బాచి రెండు, మూడవ స్థానాలు దక్కించుకున్నట్లు తెలిపారు. ఉమ్మడి కడప జిల్లా అధ్యక్షులు కె.విజయభాస్కర్ రెడ్డి, కార్యదర్శి డి.సుజన కుమార్, కోశాధికారి నందకిషోర్ కార్యనిర్వహణలో నిర్వహించిన మాయాలోకం-2 అనే ఈ కార్యక్రమ ప్రదర్శనకు చెర్రీస్ స్కూల్ యాజమాన్యం అతిథులకు ఆల్పాహారం అందించగా, టీచర్ మైండ్స్, శ్రీ సాయి విద్యాలయస్కూల్ వారు ఆర్థిక సహాయ సహకారాలు అందించారన్నారు. వారిని నిర్వాహకులు శాలువాతో ఘనంగా సన్మానం చేశారు. కార్యక్రమంలో ప్రముఖ కళాకారులు ఎస్.కృష్ణకుమార్, డాక్టర్ బాలరాజు పాల్గొన్నారు.

బ్రౌన్ గ్రంథాలయం దేశానికి వారసత్వ సంపద

ప్రజాశక్తి- కడప అర్బన్ : సి.పి.బ్రౌన్ నివసించిన స్థలంలో ఏర్పడిన బ్రౌన్ స్మారక గ్రంథాలయం దేశానికి వారసత్వ సంపదని ఉమ్మడి తెలుగు రాష్ట్రాల ఇంటాక్ కన్వీనర్ సింగం లక్ష్మీనారాయణ అన్నారు. ఆదివారం సి.పి.బ్రౌన్ గ్రంథాలయాన్ని సందర్శించిన ఆయన మాట్లాడుతూ డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి లాంటి మహనీయుల కృషి ఫలితంగా వెలసిన గ్రంథాలయంలోకి అడుగిడడం తన అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. పరిశోధన కేంద్రంలో భద్రపరచిన ప్రాచీన తాళపత్రగ్రంథాలు, చేతితో తయారు చేసిన రాతప్రతులు, తామ్రపత్రం, నాణేలు లాంటి పలు ప్రాచీన సంపదను కాపాడడం అభినందనీయమన్నారు. గ్రంథాలయ అభివృద్ధికి కావాల్సిన సహాయ సహకారాలను ఇంటాక్ సంస్థ తరపున అందిస్తామన్నారు. ఈ సందర్భంగా గ్రంథాలయ శాశ్వత సభ్యత్వాన్ని పొందడం ఆనందాన్నిచ్చిందన్నారు. కార్యక్రమంలో సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సలహా మండలి సభ్యులు జానమద్ది విజయభాస్కర్, సహాయ పరిశోధకులు చింతకుంట శివారెడ్డి పాల్గొన్నారు.

తొలగించిన సైలెన్సర్లను చూపుతున్న ఎస్ఐ లక్ష్మీ ప్రసాద్‌రెడ్డి, సిబ్బంది

మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు తప్పవు

ప్రజాశక్తి -రైల్వేకోడూరు

మైనర్లు బైక్‌లను నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ లక్ష్మీ ప్రసాద్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ ఇన్‌స్పెక్టర్ హేమసుందర్‌రావు ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు నిర్వహించామని తెలిపారు. ద్విచక్ర వాహనాలకు సైలెన్సర్ మార్చి ఎక్కువ శబ్దంతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న యువకుల గుర్తించి సైలెన్సర్లను తొలగించినట్లు పేర్కొన్నారు. ఇలాంటివారు ఎక్కువగా రైల్వే స్టేషన్ రోడ్డు, శాంతినగర్, చిట్వేలిరోడ్డు, పాత బజారు, కొత్త బజారు, కడప రహదారులలో తిరుగుతున్నారన్నారు. తల్లిదండ్రులు పిల్లలకు స్కూటీలు, మోటార్ సైకిల్ ఇస్తున్నారని, ఏదైనా ప్రమాదం జరిగితే తల్లిదండ్రులు బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. దయచేసి తల్లిదండ్రులు బాధ్యత వహించి మైనర్లకు వాహనాలను ఇవ్వద్దని విజ్ఞప్తి చేశారు.

సోమవరం, గుట్టపల్లి పంచాయతీలను

కలకడ మండలంలో చేర్చాలి

- ప్రభుత్వానికి ప్రజల విన్నపం

ప్రజాశక్తి- కలకడ

సంబేపల్లి మండల పరిధిలో ఉన్న సోమవారం గుట్టపల్లి పంచాయతీలను కలకడ మండ లంలో చేర్చాలని రెండు గ్రామాల ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. గతంలో కడప జిల్లాగా ఉన్నప్పుడు సంబేపల్లి మండల పరిధిలో ఉన్న ఈ రెండు గ్రామాల ప్రజలు, రైతులు తమ అవసరాల నిమిత్తం నేరుగా కడపకు వెళ్లే వాళ్లమని తెలిపారు. గత ప్రభుత్వం కడప జిల్లా నుంచి కొన్ని నియోజకవర్గ వర్గాలను వేరుచేసి అన్నమయ్య జిల్లాగా రాయచోటిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాయచోటి జిల్లా కేంద్రంగా ఉన్న సమయంలో రాకపోకలకు దగ్గరగా ఉండేదని, సమయం కూడా తక్కువ పట్టేదన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిని తొలగించి రాజంపేటకు మారుస్తారని, ఇటు మదనపల్లి జిల్లాలు ఏర్పాటు చేస్తున్నట్లు పలు పత్రికల్లో రావడం గమనించినట్లు తెలిపారు. ఈ క్రమంలో ఈ రెండు గ్రామ ప్రజలు రాజంపేట జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే చాలా ప్రాయాసపడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాయచోటి, రాజంపేట మార్గమధ్యంలో రెండు భయంకరమైన ఘాట్ రోడ్లు దాటి వెళ్లవలసి ఉందని, అంతేకాకుండా సమయం కూడా ఎక్కువ పడుతుందన్నారు. జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే సుమారు ఒక్కరోజు పూర్తిగా కేటాయించవలసిన అవసరం పడుతుందని వాపోతున్నారు. అలా కాకుండా మదనపల్లి జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేస్తే మా రెండు పంచాయతీలను కలకడ మం డలంలో చేరిస్తే రాకపోకలకు సులభంగా ఉంటుందన్నారు. సోమవరం, గుట్టపల్లి రెండు పంచా యతీలు కలకడకు సమీపంలో ఉండటంతో వీటిని కలకడ మండలంలో చేర్చా లని సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్‌బాబు, రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని కోరారు. కూటమి ప్రభుత్వం గుర్తించి తమకు న్యాయం చేయాలని రెండు గ్రామ ప్రజలు కోరుతున్నారు.

బెల్ట్ టెస్ట్‌కు ఉత్తీర్ణులైన క్రీడాకారులు

తైక్వాండో అకాడమీ ఆధ్వర్యంలో బెల్ట్ టెస్ట్

ప్రజాశక్తి-రాజంపేట

స్థానిక ఎంపిడిఒ కార్యాలయ ఆవరణంలో మాస్టర్ సగినాల పిచ్చయ్య ఆధ్వర్యంలో నేషనల్ రెఫరీ సగినాల రిజ్వాన్ పర్యవేక్షణలో బెల్ట్ ఉత్తీర్ణత పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ఎం.గౌతమ్, ఎం.సాహితి, జి.దీపిక్ లు రెడ్ బెల్ట్ కు ఉత్తీర్ణులు కాగా రితేష్ రెడ్డి బ్లూ వన్, జకియా తస్నీమ్, జొహైబ్ అలీ బ్లు బెల్ట్, డి.భరత్ష్, డి.తన్విరెడ్డి, పి.దీక్షిత, ఎ.సుహన్ గ్రీన్ వన్ కు ఉత్తీర్ణులైనట్లు తెలిపారు. దర్షన్ నాయక్, ఎం.దీపాలి గ్రీన్ బెల్ట్, వి.పునీత్ తేజ ఎల్లో బెల్ట్ కు ఉత్తీర్ణులయ్యారని మాస్టర్ పిచ్చయ్య తెలిపారు. కార్యక్రమంలో కోచ్ జాహిద్ అలీ, సుధాకర్ విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పోరాట స్ఫూర్తిని నింపిన గేయం వందేమాతరం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

భారతీయుల్లో స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తిని నింపిన గేయం వందేమాతరం అని ఎపి సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, జిల్లా అధ్యక్షుడు మునిగోపాల్ కృష్ణ పేర్కొన్నారు. ఆదివారం సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వందేమాతరం 150 వసంతాల వేడుకను స్థానిక జికెటిలో పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి సెక్రటరీ కరుణాకర్, ట్రెజరర్ ఉస్మాన్ సాహెబ్, కంచర్ల శ్రీనివాసుల నాయుడు, అసిస్టెంట్ ప్రొఫెసర్ కుంటుముక్కల మంజు ప్రీతమ్, బిడిటి యువసేన నాయకుడు కంచర్ల చింటు లు హాజరై 150 వసంతాలు నిండిన వందేమాతర గీతం గురించి వివరించారు. వైస్ ప్రెసిడెంట్ జగన్ మోహన్, డాక్టర్ చంద్ర శేఖర్, డాక్టర్ గొల్లపూడి తిరుపతిరావు, నవలా రచయిత టి.ఎస్.ఎ కృష్ణమూర్తి, మహిళా ప్రతినిధి సరస్వతి లు వందేమాతరం విశిష్టతను గురించి వివరిస్తూ రచయిత బంకించంద్ర చటర్జీ సేవలను కొనియాడారు. మదనపల్లెను జిల్లా కేంద్రం చేయడానికి ప్రతిపాదన పెట్టినందులకు ఎపి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, యువ నాయకుడు మంత్రి లోకేష్ బాబు, మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్ బాషాకి ధన్యవాదాలు తెలియజేశారు. సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏకగ్రీవంగా మదనపల్లెను శ్రీకృష్ణ దేవరాయలు జిల్లాగా ప్రకటించాలని ముఖ్యమంత్రిని కోరారు.

కూటమి ప్రభుత్వం డొక్కు, ట్రబుల్ ఇంజిన్

ప్రజాశక్తి - వేంపల్లె

చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం డొక్కు, ట్రబుల్ ఇంజన్‌గా మారిందని పిసిసి అధికార ప్రతినిధి నర్రెడ్డి తులసిరెడ్డి ఎద్దేవా చేశారు. ఆదివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైసిపి పాలనలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో కేంద్రం నుంచి రూ.34,698 కోట్లు గ్రాంట్ రూపంలో రాష్ట్రానికి రాగా, కూటమి పాలనలో 2024-25లో కేవలం రూ.20,135 కోట్లు మాత్రమే గ్రాంట్ రూపంలో వచ్చిందని చెప్పారు. ముందు సంవత్సరం కంటే రూ.14.563 కోట్లు తగ్గిందని పేర్కొ న్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో తొలి 6 నెలల్లో కేంద్రం నుండి కేవ లం రూ.4,014 కోట్లు మాత్రమే గ్రాంట్ వచ్చిందన్నారు. అదే సమయంలో 2023-24లో రూ.21,270 కోట్లు వచ్చిందని తెలిపారు. డబుల్ ఇంజిన్ వల్ల కేంద్రంలో రాష్ట్రంలో ఒకే కూటమి అధికారంలో ఉంటే రాష్ట్రానికి ప్రయోజనం కలుగుతుందని నరేంద్ర మోడీ, చంద్రబాబు పదేపదే చెబు తుంటారన్నారు. దానికి ఇప్పుడు వారేమి సమాధానం చెబుతారని ప్రశ్నించారు. చంద్రబాబు నేతృత్వంలోని కూటమి పాలనలో రాష్ట్రంలో సంపద ఆవిరైందని విమర్శించారు. బడ్జెట్‌లో మూలధన వ్యయం 2023-24 ఆర్థిక సంవత్సరంలో వైసిపి పాలనలో రూ.23,589 కోట్లు కాగా, కూటమి పాలనలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో కేవలం రూ.19,176 కోట్లు మాత్ర మే అన్నారు. అప్పులు చేయడంలో కూటమి ప్రభుత్వానికి అవార్డు ఇవ్వవచ్చని తులసిరెడ్డి ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం కేవలం 17 నెలల కాలంలో రూ.2 లక్షల 27 వేల కోట్లు అప్పుచేసి ఆల్ టైం రికార్డు సృష్టించిందన్నారు. పోలవరం ప్రాజెక్టు ఆధారిత కార్యాలయాన్ని తెలంగాణ రాష్ట్రం నుండి ఆంధ్రప్రదేశ్ తెప్పించి రాజమండ్రిలో ఏర్పాటు చేయాలని తులసి రెడ్డి సూచించారు.

ఆటో, బైక్‌లకు నిలయంగా ఆర్‌టిసి బస్టాండ్

- పట్టని అధికారులు

ప్రజాశక్తి- కలకడ

కలకడ ఆర్‌టిసి బస్టాండ్ ఆవరణంలో పార్కింగ్ చేసిన ఆటోలు, ద్విచక్రవాహనాలు

ఆటో, ద్విచక్రవాహనాలకు నిలయంగా కలకడ ఆర్‌టిసి బస్టాండ్ మారిందని స్థానికప్రజలు ,ప్రయాణికులు పేర్కొన్నారు. మండల కేంద్రమైన కలకడలో ప్రజలు, ప్రయాణికులు రాకపోకలకు సౌకర్యార్థంగా బస్టాండు ఏర్పాటు చేశారు. నిత్యం ఇక్కడి నుంచి రాయచోటి, కడప, ప్రొద్దుటూరు, బద్వేలు, పీలేరు, చిత్తూరు, తిరుపతి, మదనపల్లి డిపోలకు చెందిన బస్సుల రాకపోకలు సాగిస్తుంటాయి. నిత్యం రద్దీంగా ఉంటే బస్టాండ్‌లో బస్సులకు అడ్డుగా ఆటోలు, ద్విచక్రవాహనాలు, కార్లు పార్కింగ్ చేయడంతో ఇబ్బందిగా మారిందని ఆవేదన చెందుతున్నారు. ఆటోలు, స్కూటర్లు, కార్లు అడ్డంగా పెట్టడంతో బస్టాండ్‌కి వెళ్లాలంటే ఎలా వెళ్లాలని బస్సు డ్రైవర్లు, కండక్టర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అడ్డుగా ఉన్న వాహనాలను తొలగించమంటే కొందరు ఘర్షణకు దిగుతున్నారని వాపోయారు. ఈ బస్టాండ్‌లో పీలేరు డిపోకు చెందిన ఒక మహిళను కంట్రోలర్ గా ఏర్పాటు చేశారు.ఆమె ఉదయం 9 నుండి సాయంత్రం 5 గంటల వరకు నామమాత్రంగా ఉండి, వాహనములను క్రమబద్ధీకరణ చేయలేకపోతున్నారని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. బస్టాండ్ ఆవరణంలో ఉన్న కంట్రోలర్ చెప్పే మాటలను పెడచెవిన పెడుతూ లెక్కచేయకుండా పార్కింగ్ చేసి వెళుతున్నామని ఆమె పేర్కొన్నారు. గతంలో ఉన్న పీలేరు, రాయచోటి ఆర్‌టిసి డిపో మేనేజర్లకు ఎన్నో పర్యాయాలు విన్నవించినా ఏమాత్రం స్పందించలేదన్నారు. ఉదయం నుంచి రాత్రి 9 గంటల వరకు బస్టాండ్ ఆవరణమంతా బైక్‌లు, ఆటోలు, ఇతర వాహనాలతో నిండిపోయి ఇబ్బంది మారిందన్నారు. వాహనాలను నియంత్రించేందుకు మగ వ్యక్తిని కంట్రోలర్‌గా నియమించాలన్నారు. అధికారులు దృష్టి సారించి బస్టాండ్ ఆవరణంలోకి ప్రయివేట్ వాహనాలు బస్టాండ్ ఆవరణంలో పార్కింగ్ చేయకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

జాతీయ, రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు విద్యార్థుల ఎంపిక

షూటింగ్‌బాల్ పోటీలకు కన్నెమడుగు విదార్థులు

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

ప్రియా, ప్రవళిక

సెప్టెంబర్ నెల కర్నూలు జిల్లాలో జరిగిన రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీలు ఉత్తమ ప్రతిభ కనబరచిన కన్యమడుగు జడ్‌పి హైస్కూల్ విద్యార్థులు జి.రిషిత, ప్రియా, ప్రవళిక ఆంధ్రప్రదేశ్ జట్టులు స్థానం సంపాదించారని హెచ్ఎం తెలిపారు. రాష్ట్ర జట్టుకు ఎంపికైన విద్యార్థులు నవంబర్ 9 వ తేదీ నుంచి 12వతేదీ వరకు ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని ఘజియాబాద్‌లో జరిగే జాతీయస్థాయి పోటీ లలో పాల్గొంటారని షూటింగ్ బాల్ కార్యదర్శి పరశురామ్, జిల్లా షూటింగ్ బాల్ కన్వీనర్ నరేష్ కుమార్ తెలిపారు.ఈ క్రీడాకారులని పాఠశాల ప్రధ్యాపాద్యాయులు, మదన్ మోహన్, ఉపాధ్యాయులు గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

క్రికెట్ జట్టుకు విద్యార్థిని ఎంపిక

గౌతమి

లక్కిరెడ్డిపల్లి : మండలంలోని జాండ్రపల్లి ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న సి.గౌతమి అండర్-17 క్రికెట్ జట్టుకు ఎంపికైనట్లు హెచ్ఎం సిద్దేశ్వరయ్య, పిఇటి చక్రపాణి తెలిపారు. కడప మున్సిపల్ మైదానంలో జరిగిన జిల్లాస్థాయి క్రికెట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి అండర్-17 క్రికెట్ పోటీలకు ఎంపికైందన్నారు. రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు తమ పాఠశాల విద్యార్థిని రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపిక కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. గౌతమి భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయలు అభినందనలు తెలిపారు.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం : 'నల్లారి'

ప్రజాశక్తి-కలికిరి

నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతున్న కిషోర్‌కుమార్‌రెడ్డి

నియోజకవర్గ అభివృద్దే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తానని ప్రజలు, నాయకులు సహకరించాలని కోరారు. ఆదివారం మండలంలోని పతేగడ పంచాయతీ కొట్టాల లోని నల్లవీర గంగమ్మ గుడి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం పాలెం గ్రామంలోని టిడిపి కార్యకర్త రమణ గృహప్రవేశం కార్యక్రమంలో పాల్గొని ఆ గ్రామంలో జరిగే అభివృద్ధి కార్యక్రమాలపై నాయకులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధి మన లక్ష్యమని దానికి నాయకులు, కార్యకర్తలు, అధికారులు అందరూ సహకరించాలని కోరారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. త్వరలో వచ్చే స్థానిక సంస్థలు ఎన్నికలకు కార్యకర్తలు, నాయకులందరూ ఆయా గ్రామాల పరిధిలో సిద్ధంగా ఉండి అన్ని స్థానాలు గెలిచే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో మర్రికుంటపల్లి సర్పంచ్ రెడ్డి రామ్ నాయకులు కె వెంకటరమణారెడ్డి, ఎంపిటిసి చిన్నరెడ్డి, చెల్లయ్య మున్వర్‌అలీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బంజారా సేవాసంఘం బలోపేతానికి కృషి

ఐక్యత చిహ్నం చూపుతున్న బంజారాసేవా సంఘం నాయకులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఆలిండియా బంజారా సేవా సంఘం (ఎఐబిఎస్ఎస్) బలోపేతానికి నూతన కమిటీలు కృషి చేయాలని సంఘం రాష్ట్ర అధ్యక్షులు బాణావత్ చక్రినాయక్ పిలుపునిచ్చారు. జిల్లాలో నూతనంగా ఎంపికైన పలు కమిటీల ప్రమాణ స్వీకారోత్సవం ఆదివారం సేవాఘడ్ సుగాలిమిట్ట వద్ద ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బాణావత్ చక్రినాయక్ ,రాష్ట్ర ప్రధానకార్యదర్శి జటావత్ రాంబాబునాయక్, రాష్ట్ర యువజన అధ్యక్షులు చౌహాన్, రాష్ట్ర నాయకులు వెంకటరమణనాయక్, రామచంద్ర నాయక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీ, మండల కమిటీ, పట్టణ కమిటీల సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.జిల్లా అధ్యక్షు లుగా బి.నాగు నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా బి.శంకర్ నాయక్, జిల్లా కోశాధికారిగా బి.రవీంద్రనాయక్, జిల్లా ఆర్గనైజర్ సెక్రెటరీగా ఎం.రెడ్డి నాయక్, జిల్లా యువజన అధ్యక్షులుగా ఎం.మనోజ్ కుమార్‌నాయక్, జిల్లా యువజన ప్రధాన కార్యదర్శిగా బి.వెంకటేష్ నాయక్, జిల్లాఉపాధ్యక్షులుగా బి.కుమార్‌నాయక్, మదనపల్లి పట్టణ అధ్యక్షులుగా బి.చిన్ని నాయక్, జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు గా బి.శైలజ, మదనపల్లి జనరల్ సెక్రెటరీ గా రమేష్ నాయక్, మదనపల్లి ఉపాధ్యక్షులుగా బి.సాయిప్రసాద్ నాయక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ఎం.నాగరాజనాయక్, పవన్ కుమార్‌నాయక్, బాలాజీ నాయక్, కుమార్‌నాయక్, రజిని నాయక్ పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-రాయచోటి అర్బన్

మాట్లాడుతున్న పిసి. రెడ్డన్న

విశ్రాంత ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు రకాల సమస్యలను తక్షణమే పరి ష్కరించాలని ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి పిసి రెడ్డన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం సాయంత్రం స్థానిక ఎన్‌జిఒ సభా భవనంలో జిల్లా ప్రభుత్వ పెన్షన్ అసోసియేషన్ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన రెడ్డెన్న మాట్లాడుతూ ఉద్యోగులకు రావలసిన పిఎఫ్ , కమ్యూ టేషన్ గ్రాట్యూటీ, ఎన్కాష్మెంట్ ఆఫ్ ఎర్న్ లీవ్ సకాలంలో మంజూరు చేయాలని కోరారు. వెంటనే పిఆర్‌సి ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విశ్రాంత ఉద్యోగుల హక్కుల పరిరక్షణ సంఘం బాధ్యతన్నారు. సమా వేశంలో అసోసియేషన్ జిల్లా అధ్య క్షుడు వెంకటరమణ, రాయచోటి తాలూకా అధ్యక్ష కార్యద ర్శులు జంగల్ రెడ్డి ఈశ్వరయ్య, గుడిబండ శ్రీనివాసులు, విశ్వనాథరెడ్డి ,రఘునాథ రెడ్డి ,రామయ్య ,రామ్మోహన్ రెడ్డి, ఆరిఫ్, అల్లాభకష్, రామచంద్రయ్య పాల్గొన్నారు.

సామాజిక అవగాహన అవసరం

ప్రజాశక్తి - జమ్మలమడుగు

ప్రతి ఒక్కరూ సామాజిక అవగాహన కలిగి ఉండాలని సీనియర్ న్యాయవాది మురళీధర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక కోర్టు ప్రాంగణంలో న్యాయవాదికోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు విద్యార్థులకు న్యాయ సేవ ప్రాధికార సంస్థ, లోక్‌అదాలత్, బాల్య వివాహాల వల్ల కలుగు నష్టాలను, వరకట్న వేధింపుల చట్టాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు చంద్రశేఖర్ రెడ్డి, సి.సుబ్బారెడ్డి, బివి సుబ్బారావు, జయన్న, స్రవంతి, విద్యార్థులు పాల్గొన్నారు.

గతం మర్చిపోకు ఆదినారాయణరెడ్డి : వైసిపి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

గతం మర్చిపోయి జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి మాట్లాడుతున్నారని, అసలు వైఎస్ కుటుంబం లేకపోతే మీరు, మీ కుటుంబం ఏ స్థాయిలో ఉండేవారో తెలుసుకోవాలని వైసిపి నాయకులు మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మార్కెట్ యార్డు మాజీ చైర్మెన్ చిన్నప్ప, నూర్బాషా సంఘ అధ్యక్షుడు రసూల్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక వైసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ చంద్రబాబు మెప్పుకోసం ఆదినారాయణరెడ్డి వైఎస్ కుటుంబంపై మాట్లాడడం నీచమైన రాజకీయమన్నారు. పులివెందులలో గడిచిన జెడ్పీటీసీ ఎన్నికలలో సాక్షాత్తు డీఐజీ, ఇతర పోలీసు అధికారులను అడ్డంపెట్టుకొని దౌర్జన్యంగా దొంగ ఓట్లతో గెలిచిన గెలుపును రాయలసీమ బాషలో ఏమంటారో ఆదినారాయణరెడ్డికే తెలుసున్నారు. సాధారణ ఉద్యోగిగా ఉన్న మీరు రాజకీయంగా ఈ రోజు ఈస్థాయికి రావడం వెనుక ఉన్న కారణం ఏమిటీ అని ప్రశ్నించారు. ఈసారి పులివెందుల స్థానిక సంస్థల ఎన్నికల్లో జగన్ ప్రభంజనాన్ని ఎవ్వరూ ఆపలేరన్నారు. కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షుడు హాల్ గంగాధర్ రెడ్డి, పట్టణ ఉపాధ్యక్షుడు పార్నపల్లె కిషోర్, లింగాల మండల కన్వీనర్ అంబకపల్లె బాబు, కౌన్సిలర్లు రాజశేఖర్ రెడ్డి, ఖాదర్ బాషా, నాయకులు చంద్రమౌళి, సంపత్, విష్ణు, రామాంజులరెడ్డి పాల్గొన్నారు.

ఓబుళంపల్లి ఎడ్లకు మొదటి బహుమతి

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని ధరణి తిమ్మాయిపల్లి గ్రామంలో అవధూత కొండయ్య స్వామి జన్మదిన వేడుకల్లో భాగంగా ఆదివారం ఓల్డ్ కేటగిరి ఎడ్లు బండలాగుడు పోటీలను నిర్వహించారు. మూడు జతల ఎడ్లు ఒకే దూరం లాగి మొదటి మూడు స్థానాలను కైవసం చేసు కున్నాయి. చెన్నూరు మండలం ఓబులంపల్లికి చెందిన సానపురెడ్డి సతీష్‌కుమార్ రెడ్డి ఎడ్లు, కడప రూరల్‌లోని రూకవారిపల్లెకు చెందిన బొజ్జ విద్యఓబుల్‌రెడ్డి ఎడ్లు, వరదాయపల్లెకు చెందిన బెస్త శ్రీరాములు ఎడ్లు 4,400 అడుగులు లాగాయి. వీటికి మొదటి మూడు బహుమతులను కేటాయించారు. అక్కంపల్లి గ్రామానికి చెందిన కోనేపల్లి ఇంద్రారెడ్డి ఎడ్లు 4,382 అడుగులు లాగి నాల్గవ బహుమతి కైవసం చేసుకున్నాయి. వల్లూరు మండలం గోసులవారి పల్లెకు చెందిన పామిరెడ్డి వెంకటమోహిత్ రెడ్డి ఎడ్లు 4,246.2 అడుగులు లాగి 5వ స్థానంలో నిలిచాయి. బండలాగుడు పోటీలకు వ్యాఖ్యాతగా గంగారు చంద్రమోహన్‌రెడ్డి వ్యవహరించారు. 6 పండ్ల విభాగంలో ఎడ్లకు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు గంగిరెడ్డి శివమారుతిరెడ్డి యాంకర్‌గా వ్యవహరించారు.

కడప పెద్దదర్గాలో పూలచాదర్‌ను సమర్పిస్తున్న ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి

పెద్దదర్గా ఉరుసు ఉత్సవాల్లో ఎమ్మెల్యే

ప్రజాశక్తి-బి.కొత్తకోట

కడప అమీన్ పీర్ పెద్ద దర్గాలో ఉరుసు ఉత్సవాల్లో పాల్గొనడం సంతోషంగా ఉందని తంబళ్లపల్లి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం అమీన్ పీర్ దర్గా ఉరుసు మహోత్సవంలో పాల్గొని చాదర్ సమర్పించి, ప్రత్యేక ప్రార్థనలలో పాల్గొన్నారు. అనంతరం పీఠాధిపతి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కడప జిల్లాలోని పెద్ద దర్గాకు విశిష్ట ప్రాముఖ్యత ఉందని, సర్వమతాలకు అతీతంగా ఇక్కడ భక్తులు వచ్చి ఉరుసు ఉత్సవంలో పాల్గొంటారని వివరించారు. కడప పెద్ద దర్గా సందర్శించడానికి సెలబ్రిటీలతో పాటు చాలామంది ప్రముఖులు హాజరవు తారన్నారు. ఆధ్యాత్మిక వాతావరణంలో జరిగే ఉరుసు ఉత్సవంలో పాల్గొనటానికి పెద్దఎత్తున ఆసక్తి చూపిస్తారన్నారు. ఎమ్మెల్యే వెంట వైసిపి రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి ఎస్.ఏ.కరీముల్లా, మాజీ స్టేట్ ఇరిగేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ దండాల రవిచంద్రారెడ్డి, సాయి మల్లి కన్స్ట్రక్షన్స్ ఎండి మల్లికార్జునరెడ్డి, కాలువపల్లి మధుసూదన్‌రెడ్డి, కిషోర్‌రెడ్డి ఉన్నారు.

అన్నదాన కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ సభ్యులు

అన్నదానం గొప్పది

ప్రజాశక్తి-రామాపురం

జీవితంలో చివరి అంకంలో ఉన్న వృద్ధులకు అన్నదానం చేయడం మనసుకు ఎంతో సంతోషాన్ని ఇస్తుందని దాత పోలూరు సురేష్‌నాయుడు, శివకళ అన్నారు. మండలంలోని బండపల్లి పంచాయతీ ప్రేమాలయంలోని వృద్ధాశ్రమంలో శివకళ పుట్టినరోజు పురస్కరించుకొని ఆదివారం అన్నదానం చేశారు. రాయచోటి టౌన్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పసుపులేటి శ్యామ్ సహకారంతో వృద్ధుల కు అన్నదానం చేయడం సంతోషంగా ఉందన్నారు. రాబోవు రోజుల్లో తమ కుటుంబంలో ఎలాంటి కార్యక్రమాలు జరిగినా లయన్స్‌క్లబ్ సహకారంతో సమాజానికి ఉపయోగపడే విధంగా కార్యక్రమాలు చేసుకుంటామన్నారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ మాజీ అధ్యక్షుడు పి.శివారెడ్డి , కార్యదర్శి షేక్ అహ్మద్, దాతల కుటుంబ సభ్యులు, ఆశ్రమ సిబ్బంది పాల్గొన్నారు.

మండల సమావేశం వాయిదా

ప్రజాశక్తి-గాలివీడు

సోమవారం జరగాల్సిన గాలివీడు మండల సర్వసభ్య సమావేశం వాయిదా పడినట్లు ఎంపిడిఒ చంద్రమౌళీశ్వర్ పేర్కొన్నారు. 12న ముఖ్యమంత్రి ఎన్ చంద్రబాబు నాయుడు చిన్నమండెం పర్యటన సందర్భంగా పోలీస్ బందోబస్తు నిర్వహించడానికి సిఐ, ఎస్ఐ, పోలీస్ సిబ్బంది బందోబస్తు చిన్నమండెంకు వెళ్లడంతో సమావేశం వాయిదా పడినట్లు ఆయన పేర్కొన్నారు. తదుపరి తేదీని ప్రకటిస్తామని చెప్పారు.

ప్రజాసేవే ఆమ్‌ఆద్మీ పార్టీ లక్ష్యం

ప్రజాశక్తి - వేంపల్లె

ప్రజాసేవ దిశగానే ఆమ్‌ఆద్మీ పార్టీ అడుగులేస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కో-ఆర్డినేటర్ రహమతుల్లా, జిల్లా ఉపాధ్యక్షుడు దాదాపీర్ పేర్కొన్నారు. ఆదివారం వేంపల్లె గ్రామానికి చెందిన మహమ్మద్, సమద్, హబీబ్ బాషా, షామీర్, పలువురు యువత ఆమ్‌ఆద్మీ పార్టీలో చేరారు. వీరికి రహమతుల్లా టోపీలు పెట్టి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం రహంతుల్లా మాట్లాడుతూ వేంపల్లెలో ఉన్న ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తుండడంతో యువత తాము కూడా పోరాడుతామని ముందుకు వచ్చిందన్నారు. ప్రజా సమస్యల కోసం పోరాటం చేస్తున్న ఆప్ పార్టీని గుర్తించి యువత అందులో చేరడం సంతోషకరమన్నారు. ఆప్ అధ్యక్షుడు అరవింద్ కేజ్రీవాల్ అమలు చేసిన పథకాలే నేడు కూటమి, బిజెపి, కాంగ్రెస్ ప్రభుత్వాలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. పార్టీ బలోపేతం కోసం యువత ముందుకు వచ్చి ఆప్‌లో చేరాలని కోరారు. కార్యక్రమంలో ఆప్ నాయకులు బాబ్జీ పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పట్టని కూటమి ప్రభుత్వం

ప్రజాశక్తి - వేంపల్లె :రాష్ట్రంలో ఉన్న కూటమి ప్రభుత్వానికి ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పట్టడంలేదని ఎస్టీయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఎస్ఎన్ఆర్ కల్యాణ మండపంలో ఎస్టీయు నాయకుడు ఇలియాస్ బాషా అధ్యక్షతన ఆదివారం కడప జిల్లా ఎస్టీయు కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రఘునాథరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు లబ్ధి చేకూర్చడంతోపాటు గత ప్రభుత్వం చేసిన ఆర్థిక గాయాలను మాన్పుతామని హామీలు ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చి 16 నెలలు అవుతున్నప్పటికీ 12వ పిఆర్‌సి కమిషన్ వేయలేదన్నారు. మధ్యంతర భృతి ప్రకటించలేదన్నారు. తాము ఇంకెంతకాలం ఎదురు చూడాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.సెంట్రల్ కిచెన్‌ల పేరుతో గ్రామాల్లో, పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం నిర్వహిస్తున్న ఏజెన్సీల పొట్ట కొట్టి, వారి జీవనోపాధికి కూటమి ప్రభుత్వం తీవ్ర విఘాతం కలిగిస్తోందని సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర పేర్కొన్నారు. అనంతరం జిల్లా కౌన్సిల్ సమావేశంలో రాబోవు రెండేళ్లకు నూతన జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లాలోని ఎస్టీయు నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాగనాథేశ్వర కోనపైకి వాహన రాకపోకలు నిలుపుదల

ప్రజాశక్తి - ఖాజీపేట : మండలంలోని ఉన్న నాగ నాథేశ్వర కోన పైకి వాహనాలను అను మతించడం లేదని సీఐ వంశీధర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్తిక మాసం మూడవ సోమవారం సందర్భంగా భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసు కున్నామన్నారు. ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలకు అనుమతిలేదన్నారు. ఈ విషయాన్ని భక్తులు గమనించాలని ఆయన కోరారు. వాహనాల పార్కింగ్ కోన కింద ఏర్పాటు చేశామన్నారు. పోలీసుల ఆంక్షల పట్ల అభ్యంతరం పలువురు వ్యక్తప రుస్తున్నారు. గతంలో ఎన్నడూ ఇలాంటి నిర్ణయాలు ఆలయ పాలకవర్గం, పోలీసులు తీసుకోలేదంటున్నారు. భక్తులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని కొందరు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొండపైకి వెళ్లేందుకు ద్విచక్ర వాహనాలను ఎందుకు అనుమతించరని పలువురు ప్రశ్నిస్తున్నారు. కలెక్టర్, దేవాదాయశాఖ అధికారులు ఈ నిబంధన పట్ల ఆలోచించాలని పలువురు సూచిస్తున్నారు.

క్రైం కార్నర్

దాడిలో గాయపడ్డ వ్యక్తి మృతి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మండలంలో అక్టోబర్ 31 న జరిగిన దాడిలో గాయపడిన వ్యక్తి మృతి చెందినట్లు తాలూకా సిఐ కళా వెంకటరమణ తెలిపారు. సిఐ కథనం మేరకు..కొండామర్రిపల్లి పంచాయితీ ఇసుకనూతిపల్లికి చెందిన శ్రీనివాసులు (45), అతని భార్య ప్రభావతిపై అదే ప్రాంతానికి చెందిన రవి అనే వ్యక్తి ఆర్థిక లావాదేవిలపై అక్టోబర్ 31న దాడి చేశారన్నారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన శ్రీనివాసులు రుయాలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఈ మేరకు హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.